తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
జ్రా॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
మంగళవారం
27 అక్టోబర్ 2026
పేజీలు - 12

# కొమురం భీం ఆశయాల సాధనకు కృషి

- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.180 కోట్లు
- జోడేఘాట్‌లో మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి
- గోయగంలో మిషన్ అమృత్ జల్ పైలట్ ప్రాజెక్టు ప్రారంభం



**కెరమెరి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** గిరిజనుల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం పోరాడిన కొమురం భీం ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన కలలుగన్న సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రులు దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. జోడేఘాట్, పరిసర గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.180 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కొమురం భీం 86వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కేరమేరి మండలం జోడేఘాట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు.

వార్త మెయిన్ 12లో

# ఆదివాసీ ముద్దుబిడ్డ కొమురం భీం సేవలు చిరస్మరణీయం

**కొమరం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్**

**కెరమెరి,అక్టోబర్ 26,(జనంసాక్షి) :** ఆదివాసీల ముద్దుబిడ్డ, సాయిధ పోరాట వీరుడు కొమురం భీమ్ అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అన్నారు. కొమరం భీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లాలోని కెరమెరి మండలం జోడెన్ ఘాట్ లో గల కొమరం భీం స్మృతి వనంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి లతో కలిసి కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి సమాధి వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. అంతకు ముందు జోడెన్ ఘాట్ కు విచ్చేసిన కమిషనర్ కు అధికారులు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆదివాసి గిరిజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# రామప్ప దేవాలయ భూములు భద్రమేనా?

- కౌలు లెక్కల్లో అనుమానాలు
- భూముల హద్దులపై సందేహాలు
- తగ్గుముఖం పడుతున్న విస్తీర్ణం
- సర్వే చేస్తేనే అనుమానాలకు తెర

**వెంకటాపూర్ (రామప్ప), అక్టోబర్ 26(జనం సాక్షి):** ప్రపంచ వారసత్వ సంపద,యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయానికి చెందిన ఇనాం భూములు భద్రంగా ఉన్నాయా..? అనే ప్రశ్న ప్రస్తుతం చర్చనీయాం శంగా మారింది.

వార్త మెయిన్ 7లో

# అర్జీలు స్వీకరించి... భరోసా కల్పించి...



- ప్రజావాణి అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలిలి
- జల, విద్యుత్ సంరక్షణకు పెద్దపీట వేయాలి
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మావల అక్టోబర్ 27 ( జనం సాక్షి):జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్వయంగా ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సత్వర న్యాయం అందించాలన్నారు. ఈ ప్రజావాణిలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూసమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి జిల్లా, మండల స్థాయిల్లో 66 ఫిర్యాదులు, వినతులను రావడం జరిగిందని వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులతో జల, విద్యుత్ సంరక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా అంశాలపై అన్ని శాఖల అధికారులు, ప్రైవేట్ నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, జీపీ భవనాలు, ప్రైవేట్ రెసిడెన్షియల్స్‌లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 3 కిలోవాట్ల సిస్టమ్‌కు రూ. 78,000 వరకు సబ్సిడీతో పాటు బ్యాంక్ లోన్ సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ నిధులను వెచ్చించేటప్పుడు ప్రథమ ప్రాధాన్యత తాగునీరు, ఆ తర్వాత శానిటేషన్, వాటర్ కన్జర్వేషన్, ఎనర్జీ కన్జర్వేషన్ పనులకు కేటాయించాలని స్పష్టం చేశారు. తగిన అనుమతులు లేకుండా కొత్త బోర్వెల్స్ తవ్వరాదని, బోరుబావులు, రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల ఏర్పాటును తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వాహనాలు కడగడానికి పైపులు వాడకుండా, తడి గుడ్డను ఉపయోగించి నీటి వృధాను అరికట్టాలని, అలాగే వృధా అయ్యే నీటిని గార్డెనింగ్‌కు మళ్లించాలని సూచించారు. కార్యాలయాల్లో ఏసీ ఉష్ణోగ్రతలను 24 నుండి 25 డిగ్రీల సెల్సియస్ మధ్యలో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో నీటి, విద్యుత్ సంరక్షణ పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, డిఆర్ఓ స్రవంతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వచ్చే నెల 23 నుండి 27 వరకు బుగులోని వెంకన్న జాతర

- ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే,కలెక్టర్
- రూ.8.75 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు
- రూ.4 కోట్లతో జాతర నిర్వహణ
- అన్ని శాఖల అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే గండ్ర ,కలెక్టర్ రాహుల్ శర్మ

**రేగొండ, అక్టోబర్ 26 (జనంసాక్షి):** మండలం తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు.

వార్త మెయిన్ 7లో

# వెట్టిచాకిరీ నిర్మూలన, అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యం

## ప్రచారానికి 'స్వేచ్ఛా రథం'ను జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 26 (జనం సాక్షి)** :వెట్టిచాకిరీపై అవగాహన కల్పించడం, బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 080-69434343ను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా స్వేచ్ఛ రథం వాహనాన్ని సోమవారం కలెక్టరెట్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు.ఈ ప్రచార వాహనం హనుమకొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, వెట్టిచాకిరీ, కార్మికుల హక్కులు, దోపిడీకి గురైన సందర్భాల్లో ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న విధానాలపై ప్రజలకు, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పించునుంది ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ... వెట్టిచాకిరీ నిర్మూలనకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని, వెట్టిచాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయాన్ని అందించడం కోసం సంబంధిత శాఖలు కృషి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు వెట్టిచాకిరీ చోటుచేసుకునే అవకాశం ఉన్న ఇతర పని ప్రదేశాల్లోని అసంఘటిత, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మిక రంగాలపై ఈ ప్రచారం ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని.... ఇందులో భాగంగా ఐ ఈ సి విద్య, కమ్యూనికేషన్ సామగ్రిని ప్రజలకు అందించడంతో పాటు, ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు కార్మికులకు తమ హక్కులపై అవగాహన లేకపోవడం, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థల గురించి తెలియకపోవడం లేదా ప్రతీకార చర్యలకు భయపడటం వల్ల వెట్టిచాకిరీ అనేక సందర్భాల్లో వెలుగులోకి రాకుండా ఉండవచ్చని... అడ్వాన్స్‌లు, అప్పులు, బలవంతం, బెదిరింపులు, మోసం లేదా పని నుంచి బయటకు వెళ్లే స్వేచ్ఛను పరిమితం చేయడం వంటి మార్గాల ద్వారా కార్మికులు వెట్టిచాకిరీలో చిక్కుకునే అవకాశం ఉందని..స్వేచ్ఛా రథం' ద్వారా వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, ప్రభుత్వ అధికారులు ఎలా స్పందించగలరు అనే విషయాలపై క్షేత్ర స్థాయి లో తెలియజేయాలన్నారు ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రవి , అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, భార్గవ్ కార్మిక శాఖ, పోలీసు శాఖ/యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏ హెచ్ టి యు జిల్లా న్యాయ సేవల సంస్థ డి ఎల్ ఎస్‌ఏ మహిళా, శిశు అభివృద్ధి శాఖ తదితర సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాజీవ్ నగర్ కాలనీలో కళాజాత

## ఎల్ నీనోపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ పడిదం రాజేందర్



**చెన్నారావుపేట, అక్టోబర్ 26 ( జనం సాక్షి )**: ఎల్ నీనో పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ పడిదం రాజేందర్ అన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.రానున్న రోజుల్లో ఎల్ నీనో ప్రభావం విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిని వృధా చేయకుండా ఇంకుడు గుంతలు తీసుకోవాలని ప్రతి నీటి చుక్క మానవ మనుగడకు అవసరమన్నారు. అలాగే ఏసీలు, కూలర్లు, హీటర్ల వాడకం తగ్గించి కరెంటును పొదుపుగా వాడుకోవాలని పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తాళ్ల సునీల్, నెల్లుట్ల సుమన్, యోచన, గాదెపాక బాబు, బరిగల రవీందర్, కందగట్ల రామకృష్ణ, తాళ్లపెల్లి అశోక్, వాంకుడోత్ శ్రీలత, గుగులోతు సాలమ్మ, పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలనకు
# ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

## ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (జనం సాక్షి)** :సమాజంలో అవినీతిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిజాయితీ, నైతిక విలువలు, పారదర్శకతను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి పిలుపునిచ్చారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఈ దిశగా విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు.అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న అవినీతి నిర్మూలన అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిచే అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఁప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి మాట్లాడుతూ అవినీతి వల్ల సమాజ అభివృద్ధికి ఆటంకం కలగడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను నిజాయితీగా నిర్వహిస్తూ, అవినీతికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎన్. రెహమాన్, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాపాడేది కాంగ్రెస్ పార్టీనే

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి)**: కార్మికుల హక్కులను కాపాడేది కాంగ్రెస్ పార్టీనే అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు కేటీపీపీలో టీజీ జెన్కో విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, కాంట్రాక్ట్ కార్మికులతో సోమవారం తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327 (ఐఎన్టీయూసీ) 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం కీలక కార్మిక చట్టాలను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 8 గంటల పని విధానం అమలుకు కృషి చేశారని గుర్తుచేశారు. టీజీ జెన్కో, సింగరేణి, ఆర్టీసీతో సహా అన్ని రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్మికుల హక్కులను హరించే విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, ఐఎన్టీయూసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, టీజీ జెన్కో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# కొమురం భీమ్ వర్ధంతి ఒక్క జిల్లాకే పరిమితమా?

## అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహించాలి.. ఆదివాసీ సంఘాల నేతల డిమాండ్



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 26,:(జనంసాక్షి )** ఆదివాసీ హక్కుల కోసం నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన గిరిజన వీరుడు కొమురం భీమ్ వర్ధంతిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే బంధను పరిమితం చేసి, ఇతర జిల్లాల్లోని ఆదివాసీల మనోభావాలను విస్మరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆదివాసీ నాయక పోడు సంఘం జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కొమురం భీమ్ 86వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ గ్రామగ్రామాన కొమురం భీమ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించినట్లు తెలిపారు. ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ కొమురం భీమ్ త్యాగాలు యావత్ ఆదివాసీ సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను మాటల్లో కాకుండా ఆచరణలో చూపాలని, వర్ధంతిని అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహించి, ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేసే కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముసలి చిన్నయ్య, జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సుంచు నవీన్, రామేష్, సంయుక్త కార్యదర్శి జంగిలి రాకేష్, గౌరవ సలహాదారులు మంద మల్లేష్, బోసని రాజేశ్వర్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి తోడసం గోవర్ధన్ పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి)**: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 70 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు ఎంతో ఆశతో దరఖాస్తులు ఇస్తున్నారని, వాటిని పరిశీలించి వారంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు ఎండార్స్‌మెంట్ చేశామని, తీసుకున్న చర్యలను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడండి

### ప్రజావాణిలో 113 దరఖాస్తుల స్వీకరణ



**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 26 (జనంసాక్షి):** ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని వీడాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదుల సంబంధ దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావానికి అనుగుణంగా సంబంధిత విభాగాలకు బదలాయించారు. గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గత వారం ప్రజావాణిలో స్వీకరించిన వినతుల పరిష్కార స్థితిగతులను కమిషనర్ విభాగాల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం చోటుచేసుకుంటే సంబంధిత అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రతి పౌర సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు.

### ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలు:-

టౌన్ ప్లానింగ్ 39,ఇంజినీరింగ్ 48, ఆరోగ్యం, పారిశుద్ధ్యం 15,రెవెన్యూ 10, హార్టికల్చర్ 1 మొత్తంగా 113 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దేవాదుల నీళ్ల కోసం ప్రశ్నిస్తే బీజేపీ నేతలపై కేసులా

### నీళ్లు వచ్చేవరకు పోరాటం ఆగదు.. ఎమ్మెల్యేతో బహిరంగ చర్చకు సిద్ధం



**దేవరుప్పుల, అక్టోబర్ 26 (జనం సాక్షి):** దేవాదుల సాగునీటి కోసం ధర్నా చేస్తే 13 మంది బీజేపీ నాయకులపై కేసులు పెట్టడం ఏమిటని భాగాల నవీన్ రెడ్డి, చింత సృజన్ కుమార్ ప్రశ్నించారు. బిజెపి పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు అందేవరకు పోరాటం కొనసాగిస్తామని, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని అడుగడుగునా నిలదీస్తామని హెచ్చరించారు. తమ నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలకు సమాధానంగా గురువారం ఉదయం 11 గంటలకు పాలకుర్తి పురాతన శివాలయం వద్ద ఎమ్మెల్యేతో కలిసి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు లకావత్ రవి, ఎండోమెంట్ కన్వీనర్ ఈర్ల రాజు, కో-కన్వీనర్ భాషిపాక సుధాకర్, బస్వ మహేష్, బస్వ రమేష్, కాసాని సత్తయ్య, వేల్పుల దేవరాజు, భాషిపాక కొండయ్య, అజయ్, అమరేందర్, మూడ అన్వేష్, తిమ్మాపురం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# బుగులోని జాతరలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు
- వచ్చే నెల 23 నుండి 27 వరకు జరగనున్న జాతర
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**రేగొండ,అక్టోబర్26( జనం సాక్షి):** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ప్రతి యేటా నవంబర్ మాసంలో కార్తీక పౌర్ణమికి అంగరంగ వైభవంగా జరిగే జాతరలో భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చేనెల 23 నుండి 27 వరకు అంగరంగ వైభవంగా జాతర జరుగుతుందని ఈ జాతరకి రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాదిమంది వస్తారన్నారు. వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతరలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రూ. 4 కోట్లతో జాతరలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జాతర సమయానికి వాటిని పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.గత జాతరకు రూ. 8 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశానని అటవీ శాఖ చట్టాలతో తో కొన్ని పనులు పూర్తి కాలేదన్నారు.. త్వరలోనే అటవీ శాఖ సమన్వయంతో జాతరను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ... భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే జాతరను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కు శాలువాతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో జాతర చైర్మన్ గంగుల రమణారెడ్డి, తిరుమలగిరి గ్రామ సర్పంచ్ చల్లగురుల సుదర్శన్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, మాజీ జాతర చైర్మన్లు కట్ల చిన్ని, రోశీటాల వెంకటస్వామి , ఉపసర్పంచ్ ఆకుతోట తిరుపతి, జాతర పురోహితుడు కూరుమాచలం వెంకటేశ్వర్లు, తిరుమలగిరి కాంగ్రెస్ నాయకులు మంతెపూరి తిరుపతి, రోశీటాల రఘుపతి, మచ్చిక రాజ్ కుమార్, మామిడాల సందీప్, లాంసాని దేవేందర్, రవీందర్ రెడ్డి, కిరణ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా విక్రయాలకు తాత్కాలిక అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోండి

### వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 26 (జనం సాక్షి)** రానున్న దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు కోరే వారు, అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన పూర్తి దరఖాస్తులను నవంబర్ 2వ తేదీలోపు సంబంధిత డీసీపీ కార్యాలయంలో సమర్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ తెలిపారు. దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ జారీ చేసిన ఎన్ఓసీ, స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, గతంలో లైసెన్స్ ఉంటే దాని ప్రతితో పాటు, అవసరమైన చోట్ల పక్క స్థల యజమానుల అనుమతి పత్రాలు, సైట్ ప్లాన్ బ్లూప్రింట్ సమర్పించాలి. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆధాలత్ శాఖలో ప్రభుత్వ ఖజానాకు రూ.800 చెల్లించిన బ్యాంక్ చలాన్‌ను జతచేయాలి. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత డీసీపీ స్థాయి అధికారులు నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# మీ ప్రమాణం యాప్ ద్వారా హాజరు పర్యవేక్షణ

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా మీ ప్రమాణం యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో ప్రజావాణి అనంతరం మీ ప్రమాణం యాప్ నమోదుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు కేవలం 19 శాఖల అధికారులు మాత్రమే నమోదు చేసుకున్నారని, మిగిలిన వారు జాప్యం చేయకుండా వెంటనే నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. యాప్ ద్వారా హాజరు పర్యవేక్షిస్తామని తెలిపారు. సందేహాల కోసం నోడల్ అధికారి ఈడీఎం శ్రీకాంత్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఏ రిజర్వేషన్లలో ముదిరాజులను చేర్చొద్దు




**కాళేశ్వరం , అక్టోబర్ 26 , ( జనం సాక్షి)** ముదిరాజ్ కులాన్ని బీసీ డీ నుండి బీసీ ఏలోకి మార్చాలనే ప్రతిపాదనను భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల గంగ పుత్ర సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సంఘం నాయకులు తెలిపారు. సోమవారం మహాదేవపూర్ మండలంలోని తహసిల్దార్ కార్యాలయము లో వినతి పత్రం ను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని బీసీ ఏ గ్రూపులో 7 శాతం రిజర్వేషన్లు గంగ పుత్ర,రజక, నాయి బ్రాహ్మణ,వడ్డెర,మేదరి , బుడగ జంగంతో సహా 54 అత్యంత వెనుకబడిన కులాలు ఉన్నాయి. 40 లక్షల జనాభా కలిగిన ముదిరాజ్ కులాన్ని ఈ 7 శాతంలో కలిపితే మా బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.బిసీ ఏ లోని 54 కులాల పిల్లలు విద్య, ఉద్యోగ అవకాశాలను దెబ్బతింటాయని కావున ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో బీసీ ఏలోని 54 కులాలను కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మహదేవపూర్ గంగ పుత్ర సంఘం గ్రామ అధ్యక్షులు నాగుల ధర్మయ్య, ఉపాధ్యక్షులు ముద్రగడ శివరాం, కాళేశ్వరం గ్రామ అధ్యక్షులు గోర దేవయ్య,ఉపాధ్యక్షులు తూనూరి శ్రీకాంత్, బెగుళూరు అధ్యక్షులు కాపరబోయిన మహేష్ , ఉపాధ్యక్షులు కాపరబోయిన మధు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ గుడి ఆలయ చైర్మన్‌గా మంద రవీందర్ గౌడ్



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 26 జనం సాక్షి.** దామెర గ్రామములోనీ ఎల్లమ్మ గుడి ఆలయ చైర్మెన్ గా మంద రవీందర్ గౌడ్‌ను వైస్ చైర్మన్‌గా తండ.రాజును నియమించినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ గౌరవ అధ్యక్షులు ఉమ్మగోని ప్రభాకర్ గౌడ్ గౌడ్ సంఘము నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మంద రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చెయ్యకుండా ఆలయ అభివృధి కోసం గౌడ కులస్తులకోసం పని చేస్తానని అన్నారు నా ఎన్నిక కు సహకరించిన సీనియర్ గౌడ నాయకులు ఉమ్మగోని ప్రభాకర్ గౌడ్ తండ.మొండయ్య శ్రీనివాస్ గారికి సీనియర్ నాయకులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపినట్లు మీడియా ద్వారా తెలిపారు అలాగే ఎల్లమ్మ ఆలయం సభ్యులుగా మంద. రాములు పాటి. బాలగౌడ్ మాచర్ల రమేష్ తండ రమేష్. నియమించినట్లు వారు తెలిపారు.. ఈ కార్యక్రమంలో సభ్యులతో పాటు మంద రాజబాబు పాటి కుమార స్వామి మంద రాములు పాటి రమేష్ మొదలగు వారు ఉన్నారు..

## పంకెనలో కరువైన వడ్ల కళ్ళం.. తీవ్ర ఇబ్బందుల్లో అన్నదాతలు

- వరి సాగులో ముందున్నా ఐకెపి కేంద్రం లేక అరిగోస
- గత రెండేళ్లుగా తప్పని వడ్ల ఆరబోత కష్టాలు
- ఇప్పటికైనా స్పందించి కళ్ళం నిర్మించాలని అధికారులకు రైతుల వేడుకోలు



**(పలిమెల అక్టోబర్ 26 జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, పలిమెల మండలంలోని అన్ని గ్రామాలతో పోలిస్తే పంకెన గ్రామంలో వరి సాగు చాలా ఎక్కువ. ఇక్కడ రైతులు విస్తారంగా వరి పంటను పండిస్తుంటారు. అయితే, ఇక్కడ మాత్రం ఒక ఐకెపి వడ్ల కళ్ళం లేకపోవడం గమనార్హం. గ్రామంలో పంట బాగానే పండుతున్నా, ధాన్యం ఆరబెట్టుకోవడానికి సరైన వసతి లేక అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సరిగ్గా రెండేళ్ల క్రితం గ్రామంలో ఐకెపి కళ్ళం ఉండేది. అప్పట్లో వరి కోతల సమయంలో రైతులు తమ ధాన్యాన్ని ఆ కళ్ళంలోనే సులభంగా ఆరపెట్టుకునేవారు. కానీ, గత సంవత్సరం నుండి ఆ కళ్ళం అందుబాటులో లేకుండా పోయింది. దీంతో రైతుల కష్టాలు మొదలయ్యాయి. గత ఏడాది కాలంగా కళ్ళం లేక రోడ్లపైనే ధాన్యం ఆరబోయాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకస్మాత్తుగా వర్షం వస్తే ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని, వాపోతున్నారు. ఈసారైనా పంకెన గ్రామంలో ఐకెపి వడ్ల కళ్ళాన్ని ఏర్పాటు చేస్తే మా తిప్పలు తప్పుతాయి అని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఈ వరి పంట కోతకు వచ్చేసరికి ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో తక్షణమే వడ్ల కళ్ళం నిర్మించాలని కోరుతున్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ కేతిడి



**చెన్నారావుపేట, అక్టోబర్ 26(జనం సాక్షి ):** మృతురాలి కుటుంబాన్ని మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి పరామర్శించారు.మండలంలోని జల్లి గ్రామానికి చెందిన బిట్ల శ్రీనివాస్ నానమ్మ బిట్ల నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. సోమవారం దశ దిన కార్యక్రమానికి హాజరై నర్సమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.అయన వెంట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బాదావత్ బాలు, చిలుపూరి వీరస్వామి, ఇండ్ల సునీల్, తుమ్మేటి సుభాష్, పింగిలి రజినీకర్ రెడ్డి, మెండె దేవిజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో బెటాలియన్ ఆవరణలో ఓపెన్ హౌస్




**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 26 (జనం సాక్షి )** మామునూరు నాలుగో బెటాలియన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కమాండెంట్ శ్రీ ఎన్.వి.ఎస్.శ్రీనివాస్ రావు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంకు బెటాలియన్ ఆవరణలో ఉన్న ప్రభుత్య పాఠశాల, కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, సిల్వర్ క్రౌన్ స్కూల్, హ్యాపి ది స్కూల్, మదర్ థెరిస్సా స్కూల్ మొత్తం 6 పాఠశాలల నుండి మొత్తం 770 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పోలీస్ సిబ్బంది వివిధ రకాల ఆయుధాల పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కమాండెంట్ శ్రీ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, రాష్ట్ర పోలీస్ వ్యవస్థలలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సి.వంశీ మోహన్ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్స్ ఈ.వీరన్న, బి.రాజు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కార్తీక్,రవి, రాజ్ కుమార్ ,రాంప్రసాద్,కృష్ణ మరియు రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్, బెటాలియన్ ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## మందమర్రి ఏరియాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రారంభం



**రామకృష్ణాపూర్, అక్టోబర్26(జనంసాక్షి):** సింగరేణి మందమర్రి ఏరియాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి జీఎం జి.ఎల్. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వారోత్సవాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జి.ఎల్. ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఆదేశాల మేరకు ఈ ఏడాది నిజాయితీతో సమృద్ధి అనే ప్రధాన నినాదంతో అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, విభాగాలు, కార్యాలయాల్లో విజిలెన్స్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వతంత్ర భారత తొలి హోంమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఈ వారోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. సంస్థలు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ప్రణాళికలతో పాటు వాటి అమలులోనూ పారదర్శకత, నిజాయితీ ఎంతో అవసరమని అన్నారు. అవినీతి, అక్రమాలు, అవకతవకలు, అధికార దుర్వినియోగం చోటుచేసుకుంటే సంస్థ అభివృద్ధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా సంస్థ పురోగతికి ఆటంకంగా మారుతుందని వివరించారు. ప్రతి ఉద్యోగి, అధికారి విధి నిర్వహణలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. అక్రమాలు, అవకతవకల నివారణలో సింగరేణి విజిలెన్స్ విభాగం కీలక పాత్ర పోషిస్తోందని, ఉద్యోగుల్లో నిరంతరం అవగాహన కల్పిస్తూ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తోందని అభినందించారు. సంస్థను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ నిజాయితీని జీవన విధానంగా అలవర్చుకుని సింగరేణి పురోగతికి కృషి చేయాలని కోరారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి పౌరుల సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, కమ్యూనికేషన్ సెల్ అండ్ సేవ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, సీనియర్ పీఓ సత్యనారాయణ, జీఎం కార్యాలయ ఫిట్ కార్యదర్శి గీతికతో పాటు పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 30న ఇంద్రవెల్లిలో జరిగే పాంచజన్య సభను విజయవంతం చేయాలి

### కుమురం భీం విగ్రహానికి నివాళులు

### కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు-టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ బాపురావు



**నెరడిగొండ అక్టోబర్26(జనంసాక్షి) :**టిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పేర్కొన్నారు. సోమవారం రోజున ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలో తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తోకలిసి కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేస్లాపూర్‌లోని ప్రసిద్ధ నాగోబా దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి నాయకులు నిరంతరం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కొమురం భీం ఆశయాలు, ఆదివాసీల హక్కుల సాధన కోసం సాగిన పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ నాయకులు నివాళు లర్పించారు. అనంతరం నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తుండు దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గెడాం భారత్ తన అనుచరులతో కలిసి తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీలో చేరారు.రాష్ట్ర జిల్లా నాయకులు వారికి పార్టీ నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు కల్పిస్తూ, పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, జిల్లా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానం, డంపింగ్ యార్డ్ మధ్య క్రీడా ప్రాంగణమా?

- తాండూర్ మండలం రేచిని గ్రామస్థుల ఆవేదన
- ఆట స్థలం మార్చాలని యువత డిమాండ్



**తాండూర్, అక్టోబర్ 26(జనం సాక్షి)** యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు క్రీడా మైదానాలు ఎంతో అవసరం. అలాంటి మైదానాలను అందరికీ అందుబాటులో, అనువైన వాతావరణంలో ఏర్పాటు చేయాల్సిన అధికారులు స్థల ఎంపికలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం రేచిని గ్రామ యువత, ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని సుద్దోడ్ల ప్రాంతంలో ఒకవైపు శ్మశాన వాటిక, మరోవైపు చెత్త డంపింగ్ యార్డు పక్కనే తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. "శ్మశానం ఒకవైపు.. చెత్త డంపింగ్ యార్డు మరోవైపు.. మధ్యలో క్రీడా మైదానం ఉంటే యువత ఆటలు ఆడేదెలా?" అని గ్రామ యువకులు ప్రశ్నిస్తున్నారు. క్రీడా మైదానం అంటే కేవలం బోర్డు ఏర్పాటు చేయడం కాదని, విద్యార్థులు, యువత ఏ సమయంలోనైనా వెళ్లి సురక్షితంగా ఆటలు ఆడుకునేలా అనువైన వాతావరణం, అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ప్రత్యామ్నాయ ప్రతిపాదన ఇదీ.. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు యువత అభివృద్ధికి ఎన్నో చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేచిని గ్రామ యువత అధికారుల ముందుకు ఒక చక్కటి ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ఉంచారు. గ్రామానికి సమీపంలో ఉన్న 'పల్లె ప్రకృతి వనం' స్థలాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేసి, ప్రస్తుతం శ్మశానం పక్కన క్రీడా ప్రాంగణంగా కేటాయించిన స్థలాన్ని పల్లె ప్రకృతి వనంగా మార్చే అవకాశాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. అవసరమైతే తామంతా కలిసికట్టుగా శ్రమదానం చేసి, మొక్కలు నాటి పల్లె ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరిస్తామని యువత స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రతిపాదన అమలైతే క్రీడా మైదానం గ్రామ ప్రజలకు, విద్యార్థులకు మరింత చేరువగా ఉంటుందని పేర్కొంటున్నారు.

**అధికారులు స్పందించాలి:** ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్రీడా ప్రాంగణాన్ని అనువైన స్థలానికి మార్చాలని రేచిని గ్రామ ప్రజలు, యువత ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## నడికూడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వివో భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి




**నడి కూడ అక్టోబర్ 26 (జనం సాక్షి) :** సోమవారం నడికూడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నూతన వివో భవనాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరై డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ .నడికూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువవుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నదని గ్రామాలలో వివో భవనలు ఏర్పాటు చేసి మహిళలను మహారాణులను చేయాలన్నదే కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రైవేటు హాస్పిటల్స్ కు దీటుగా ప్రభుత్వ హాస్పిటల్స్ ఉన్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మలహాలు రావు ఏసిపి సతీష్ బాబు తహసిల్దార్ రాణి ఎంపీడీవో రామకృష్ణ మెడికల్ ఆఫీసర్స్ దివ్య. స్వాతి. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పెద్దబోయిన రవీందర్ యాదవ్ సంబంధిత జిల్లా అధికారులు మండల అధికారులు వైద్య బృందం కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు నడి కూడ గ్రామ పాలకవర్గం పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

### ఓటరు దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్





**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 26(జనంసాక్షి).** ఎస్ఐఆర్--2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు దరఖాస్తుల పరిష్కారం, సంబంధిత రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని నోటీసులపై ప్రక్రియను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను తగిన ఆధారాలతో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో తిరస్కరణ కేసులకు సంబంధించి, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా పేర్కొంటూ తప్పనిసరిగా స్పీకింగ్ ఆర్డర్ జారీ చేయాలని ఆదేశించారు. ఫారం--6, ఫారం--7, ఫారం--8 దరఖాస్తులను నవంబర్ 5లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బూత్‌స్థాయి అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ కార్యాలయాల్లో ఎస్ఐఆర్--2026కు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించి భద్రపరచాలని ఆదేశించారు. శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఫారం--18 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన నివేదికను పత్రికలు, ప్రసార మాధ్యమాలకు అందించాలని సూచించారు. సహాయ ఎన్నికల నమోదు అధికారులు, నియమిత అధికారుల కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ఆ నివేదికను ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల సెక్షన్ సిబ్బంది సలీం, నితీష్, సీనియర్ అసిస్టెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పొరపాట్లకు తావులేకుండా పగడ్బందీగా బూ సర్వే



**గోవిందరావుపేట: అక్టోబర్26 (జనం సాక్షి )** సోమవారం నాడు మచ్చాపూర్ గ్రామంలో సర్పంచ్ జంపాల ప్రభాకర్. పాలకవర్గం, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో భూ రీ సర్వే ప్రారంభించడం జరిగింది. సర్వే అధికారులు భరత్, సతీష్,మనోహర్ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకరి భూమి మరొకరికి వెళ్లే ప్రసక్తే ఉండకూడదు అని రైతుల భూహక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం పాత రికార్డులతో సరిపోల్చుతూ ఆధునిక సాంకేతికతతో సర్వే భూ సరిహద్దులపై సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తున్నాం అన్నారు. హెచ్చుతగ్గులు గుర్తిస్తే నోటీసులు అభ్యంతరాలపై పునఃపరిశీలన వంటి విషయాలను రైతులకు తెలియజేస్తున్నాం అన్నారు.భూమి అంటే రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదు తరతరాలుగా కుటుంబాన్ని పోషిస్తున్న జీవనాధారం అని తెలియజేసినారు. అనంతరం మచ్చపురం సర్పంచ్ జంపాల ప్రభాకర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఒకరి భూమి మరొకరికి పోకుండా జాగ్రత్తలు భూముల రీసర్వేలో అత్యంత ముఖ్యమైన అంశం రైతుల యాజమాన్య హక్కుల పరిరక్షణేనని సర్పంచ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పూర నారాయణస్వామి, సోమసాని,ఉట్ల పృథ్వి రాజ్,పిట్టల రఘు,ఊట్ల మోహన్,ఉట్ల లక్ష్మయ్య,గంగుల రాజు, బొజ్జ శ్రావణ్ కుమార్,మంతెన రాజేందర్, దరిపెల్లి పెరుమయ్య, రచ్చ మురళి, మందల లింగ అక్క తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** మహర్షి వాల్మీకి జీవితం, ఆయన రచనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, జ్ఞానం, కృషి, మంచి ఆలోచనలతోనే మనిషి జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదికవి వాల్మీకి రచించిన రామాయణం ధర్మం, సత్యం, న్యాయం, నైతిక విలువలను సమాజానికి అందించిందని, నేటికీ మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వాల్మీకి జీవితం నుంచి కరుణ, దయ, ప్రేమ, సహనం వంటి మానవీయ విలువలను నేర్చుకోవాలని, మానవత్వం, నైతిక విలువలను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇందిర, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వాల్మీకి బోయ జిల్లా అధ్యక్షులు దేశెట్టి గోపాల్, తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, వాల్మీకి బోయ పట్టణ అధ్యక్షుడు మేకల కనకయ్య, సర్పంచులు గుల్ల తిరుపతి, గుజ్జల శంకర్, నాయకులు ముత్యాల రాజబాబు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొలిపాక సతీష్



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 26 ( జనం సాక్షి ) :** పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకుని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తం రెడ్డి ని మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొలిపాక సతీష్ పట్టభద్రులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా డిగ్రీ పూర్తి చేసుసుకొని గ్రాడ్యుయేష న్ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని అన్నారు. సర్వోత్తం రెడ్డి నిరుద్యోగుల సమస్యలపై అవగా హన ఉన్న వ్యక్తి అని నీతి నిజాయితీ గా దృఢ సంకల్పం ఉన్న వ్యక్తి అని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని అన్నారు.ఈకార్యక్రమం లో మామిడ్ల శ్రీనివాస్,గట్టు రంజిత్,గట్టుకొటేశ్వర్, నక్క పాపయ్య, గట్టు సురేందర్ గౌడ్, ఏలీయా, కృష్ణ, గట్టు శివ, తాళ్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల వృద్ధికి పంట కుంటల నిర్మాణం



**పెద్దవంగర అక్టోబర్ 26 (జనంసాక్షి)** భూగర్భ జలాల వృద్ధికి పంట కుంటల నిర్మాణం దోహదపడుతుందని మండల పరిషత్ అధికారి గాలి రామ్మోహన్ అన్నారు. మండలం మోత్య తండ గ్రామపంచాయతీ లోని సోమ్లాతండలో కేంద్ర ప్రభుత్వ వి బి జి రామ్జి పథకంలో భాగంగా కొత్త ఫారం ఫండ్ (పంట కుంటలు) నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ గుగులోత్ కవితా యాకన్నా తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వివిజి రామ్‌జి పథకంలో భాగంగా ఫారం ఫండ్స్ మరియు ఇంకుడు గుంతల నిర్మాణం రైతులు నిర్మించుకోవాలని దానివల్ల భూగర్భ జలాలు అభివృద్ధి చెంది నీటి కొరత నుంచి కాపాడుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో జుజ మరియు ఫీల్డ్ అసిస్టెంట్, ఉప సర్పంచ్ ,వార్డు మెంబర్స్, మాజీ ఉప సర్పంచ్, తండావాసులు పాల్గొన్నారు.

## కొడకండ్ల మండలం ప్రజావాణి కార్యక్రమంలో

### స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవోకు ఇంటర్ గ్రేట్ స్కూల్ గురించి వినతి పత్రం

### ఎండి షన్న ఉప సర్పంచ్




**కొడకండ్ల, అక్టోబర్ 26(జనం సాక్షి)** కొడకండ్లలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం మరియు ఏర్పాటు విషయాలపై స్పష్టత గురించి మరియు కొడకండ్ల మండల కేంద్రం నుండి వేరే చోటికి తరలిపోతుంది అనే వార్తల్లో నిజమెంతో తెలియచేయాలని వివరణ కోరుతూ వినతి పత్రం స్థానిక వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్థానిక యువకులు మరియు ప్రజలు వినతి పత్రం అందజేశారు.. స్థానిక ఎమ్మార్వో వివరణ ఇస్తూ కొడకండ్ల మండలంలో అందుబాటులో ఉన్న భూ వివరాలను ఏ ఈ కి ఇచ్చామని తుది నిర్ణయం వారి చేతిలోనే ఉన్నదని తెలిపారు.. కానీ పేరంరాము మరియు స్థానిక ప్రజలు తమ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు అనుగుణంగా స్థలం ఉంది కాని కొంత మంది నాయకులు తప్పుదోవ పట్టించి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు అనుగుణంగా లేని స్థలాలను చూపించి పక్క దోవ పట్టిస్తున్నారు అని తెలియచేసారు దయచేసి స్థానికంగా అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు.. యువకులు రాజకీయ నాయకులు స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల జాబితాను నూతనంగా రూపొందిస్తున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నవంబర్ 1ని అర్హత తేదీగా నిర్ణయించి ఓటర్ల జాబితా రూపొందిస్తున్నట్లు తెలిపారు. 01.11.2023 నాటికి కనీసం మూడేళ్ల ముందే గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హులు ఫారం–18 ద్వారా నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆఫ్‌లైన్‌లో డిగ్రీ సర్టిఫికెట్ స్వీయ ధ్రువీకరణ ప్రతిని, గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో సంబంధిత అధికారికి అందజేయాలని తెలిపారు. సింగరేణి, జెన్‌కోతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, వారి కుటుంబాల్లో అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని లేఖ రాసినట్లు కలెక్టర్ తెలిపారు. తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 30న ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

## భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేసిన నారాబోయిన శ్రీనివాస్



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 26 ( జనం సాక్షి ) :** మండలంలోని తాటికొండ గ్రామంలో అంగన్వాడి టీచర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో నారాబోయిన శ్రీనివాస్ (తండ్రి కొమురయ్య) ఆధ్వర్యంలో 25 మంది గ్రామ ప్రజలకు సోమవారం భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి సమాజంలో మంచి నడవడిక కోసం, మానసిక ప్రశాంతత కోసం, దైవ భక్తి పెంపొందించడం కోసం భగవద్గీత బోధనలు ప్రజలకు ఎంతగానో అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ నిజజీవితంలో తప్పక ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బండలగట్టు శివాలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 26 ( జనం సాక్షి ) :** మండలంలోని ఫతేపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఓం శ్రీ బండలగట్టు అష్ట నామాల భూగర్భ లింగం శివాలయంలో వేల్పుల గట్టయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషే కం చేయించి పూజలు నిర్వహించారు. అనంత రం అన్నదానకార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసు కున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండండి -- జీవితాన్ని కాపాడుకోండి



చంద్రుపట్ల క్రాస్‌రోడ్డు వద్ద డ్రగ్స్, సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన కార్యక్రమం.. వాజేడు అక్టోబర్ 26 ( జనం సాక్షి) మారుమూల ఏజెన్సీ ప్రాంతం ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చంద్రుపట్ల క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం పేరూరు ఎస్సై ఆర్. అశోక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆర్. అశోక్ మాట్లాడుతూ, డ్రగ్స్ అనేది ఒక వ్యక్తి జీవితాన్నే కాదు, మొత్తం కుటుంబ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారి అని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి, కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయని, యువత తమ అమూల్యమైన భవిష్యత్తును డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి యెస్ చెప్పండి. అనే నినాదంతో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ వినియోగం లేదా అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసినప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని వివరించారు. ప్రజల భద్రత, యువత ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలని పోలీసులు పిలుపునిచ్చారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు





**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 26(జనంసాక్షి).** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, అవసరమైన చోట క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుపై తీసుకున్న చర్యలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 28 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 9, ఇందిరమ్మ ఇళ్లకు 2, పింఛన్లకు 3, ఇతర సమస్యలకు సంబంధించి 14 దరఖాస్తులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హ్యూమన్ ఎక్సెలెన్స్ -2026 అవార్డుల ప్రధానోత్సవం

### హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 26 (జనం సాక్షి)** వరంగల్ నగరంలోని హంటర్ రోడ్డు శ్రీ భద్రకాళి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఈ 6 టీవీ న్యూస్ ఛానల్ ప్రతినిధి జిల్లా రమేష్ బాబు ఆధ్వర్యంలో హ్యూమన్ ఎక్సెలెన్స్ -2026అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, విశిష్ట అతిథిగా కాంగ్రెస్ నాయకులు రాజనాల శ్రీహరి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రంగాలలో విశిష్టత కలిగిన వారిని గుర్తించి వారికి సన్మానం చేయడం అభినందనీయం అన్నారు. గతంలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను చేసిన ఈ 6 టీవీ ఛానల్ ప్రతినిధులను అభినందించారు. అవార్డు గ్రహీతలకు శు భాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా సుమారు 50 మందిని ఘనంగా సత్కరించారు. అంతకుముందు వివిధ గ్రామాలు ప్రాంతాల నుంచి వచ్చినటువంటి కళాకారులు మేధావులు తమ పాటలు మాటల ద్వారా అందరిని ఆకర్షించారు. అదేవిధంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్న జిల్లా రమేష్ బాబును ఆహుతులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ మైదాం రాజు, సతీష్, భరత్ రెడ్డి, చందన, రితీష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ చెరువులో అక్రమ నిర్మాణాలు ఆపాలి : కలెక్టర్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ వినతి





**నిర్మల్ టౌన్ అక్టోబర్ 26,(జనంసాక్షి ):** పట్టణంలోని చారిత్రక ధర్మసాగర్ చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ రాథోడ్ రమేశ్‌కు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైదర్ మాట్లాడుతూ.. చెరువు పరిధిలోని సర్వే నంబర్లు 2031, 2032లో కొందరు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. వీటివల్ల చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో పాటు, వర్షాకాలంలో వరద ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమీప నివాస ప్రాంతాల ప్రజల ప్రాణ, ఆస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. జిల్లా అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. చెరువు భూములను ఆక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ముట్టడి పిలుపుతో మాకేం సంబంధం లేదు

## టియూఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదండ్ల గట్టయ్య



**మల్హర్,అక్టోబర్26 (జనంసాక్షి)** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) పేరుతో కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ, ముఖ్యమంత్రి నివాస ముట్టడికి పిలుపునిచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని టీయూఎఫ్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం నివాసం ముట్టడి పిలుపుతో తమ టియూఎఫ్ ఫోరానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తమ ఫోరం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కోసం త్వరలోనే వెబ్‌సైట్ ప్రారంభించి తమను గుర్తింపు చేసి ఆదుకుంటుందనే భరోసా తో ఉన్నట్లు తెలిపారు. కొందరు కుట్రదారులు ఫోరం పేరును ఉపయోగించుకుంటూ తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్న వారితో తమను ముడిపెట్టవద్దని ఆయన పోలీసులను కోరారు. ఫోరం అధికారికంగా పిలుపునివ్వని కార్యక్రమాలకు తమ సభ్యులను అరెస్టులు చేస్తూ బాధ్యులుగా చేయడం సరికాదన్నారు. ఈ వ్యవహారంపై వాస్తవాలను పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని, ఫోరం సభ్యులను అనవసరంగా పోలీసుల పేరుతో ఇబ్బందులకు గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఫోరం పేరుతో కొందరు ఫేక్ ఉద్యమకారులు కొందరు కుట్రలు పన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వారిపై ఇప్పటికే తమ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ డిజిపి కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జరుగుతున్న ప్రచారంపై ఉద్యమకారులు అప్రమత్తంగా ఉండాలని యాదండ్ల గట్టయ్య కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలోజు సత్యనారాయణ, జిల్లా ప్రదాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, టియూఎఫ్ ఫోరం జిల్లా అధికార ప్రతినిధి బోయిని రాజయ్య యాదవ్, మండల అధ్యక్షులు బూడిద సతీష్, ఉద్యమకారులు చొప్పరి రాజు, షేక్ చాంద్ పాష, వెంకటస్వామి, గట్టయ్య, సారయ్య, పద్మ, విజయ, ఆకుల సదానందం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా
# ‘యాంటీ డ్రగ్స్ , సైబర్ సెక్యూరిటీ’ అంశాలపై వ్యాసరచన పోటీలు






**ఏటూరునాగారం, అక్టోబర్ 26(జనంసాక్షి).** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, అవగాహన పెంపొందించే లక్ష్యంతో ‘యాంటీ డ్రగ్స్ (మత్తు పదార్థాల నిర్మూలన)’ మరియు ‘సైబర్ సెక్యూరిటీ (డిజిటల్ భద్రత)’ అనే అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రేణుక తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి రేణుక మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు సైబర్ నేరాలు మరియు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు విస్తృతమైన అవగాహన అవసరమని పేర్కొన్నారు. దేశ రక్షణలో, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ సిహెచ్ వెంకటయ్య, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ నవీన్, ఐక్యూఏసి కో–ఆర్డినేటర్ డాక్టర్ పి జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, అధ్యాపకులు జీవవేణి, శ్రీధర్, రమేష్, శ్రీకాంత్, రాజశేఖర్‌లతో పాటు ఇతర అధ్యాపక బృందం, నాన్ టీచింగ్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెంకన్న మృతి





**మహాదేవపూర్, అక్టోబర్ 26 ( జనంసాక్షి):** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీ వార్డ్ సభ్యుడు నూకల వెంకన్న నిన్న రాత్రి హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగింది. మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఐదవ వార్డుకు చెందిన వెంకన్న కాంగ్రెస్ పార్టీ లో స్వర్గీయులైన దుద్దిళ్ల శ్రీపతిరావు కాలం నుండి పార్టీకి అనేక సేవలు నాటి నుండి నేటి వరకు అందిస్తూ ఒక నిజమైన నాయకుడిగా, కాంగ్రెస్ పార్టీ తో పాటు మండల కేంద్రంలో ఒక బలమైన ముద్ర వేసుకున్నటువంటి వ్యక్తి నూకల వెంకన్న, గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న ఆదివారం రాత్రి మృతి చెందడం జరిగింది. వెంకన్న మృతి చెందినవార్త కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అలాగే నాయకుల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. వెంకన్న కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం చాలకృషి చేసిన వారిలో ఒకరు, ఎలాంటి పదవులకు ఆశించకుండా కాంగ్రెస్ పార్టీ దుద్దిల్ల శ్రీధర్ బాబు విజయమే లక్ష్యంగా పార్టీకు సేవలందిస్తు వెంకన్న అకాల మృతి, పార్టీకు తీరని లోటుగా భావిస్తున్నారు కార్యకర్తలు నాయకులు. ఆదివారం రోజు మండల కేంద్రంలోని వెంకన్న స్వగృహంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు అలాగే నాయకులు చేరి వెంకన్న పార్టీనా దేహానికి నివాళులు అర్పించారు.

**వెంకన్న పాడే మోసిన గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు.**

నూకల వెంకన్న అకాల మరణం యావత్ కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతుందని ఒక గొప్ప కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త ను కోల్పోవడం జరిగిందని అన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, నూకల వెంకన్న అంతిమ కార్యక్రమాల్లో పాల్గొన్న చైర్మన్ కోట రాజబాబు వెంకన్న పాడిన మోయడం జరిగింది. అంతిమయాత్రలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుడాల శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు మహిళ నాయకురాలు. గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన

## బిజెపి పార్టీ భూపాలపల్లి నియోజకవర్గం ఇన్చార్జ్ చందుపట్ల కీర్తి రెడ్డి



**టేకుమట్ల అక్టోబర్ 26 జనంసాక్షి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా: టేకుమట్ల మండలం రాఘవపూర్ గ్రామంలో ఇటీవల పరమపదించిన బాల్ల కొమురయ్య కుటుంబాన్ని, అలాగే సోమనపల్లి గ్రామంలో ఇటీవల పరమపదించిన కీ॥శే॥ అబ్బెంగల లస్మయ్య కుటుంబాన్ని ఈరోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులను కోల్పోవడం ఎంతో బాధాకరమని, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుర్రపు నాగరాజు గౌడ్, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి బూత్ అధ్యక్షులు మంద వెంకటేష్ రమేష్ మండల నాయకులు రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ కార్యాలయంలో కొమురం భీమ్ వర్ధంతి కార్యక్రమం

## గిరిజన వీరుడు కొమురం భీమ్‌కు నివాళులర్పించిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



**ఏటూరునాగారం, అక్టోబర్ 26(జనంసాక్షి).** గిరిజన హక్కుల కోసం పోరాడిన వీరుడు కొమురం భీమ్ వర్ధంతిని పురస్కరించుకుని ఎటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో నివాళులర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో కొమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆయన త్యాగం, పోరాట స్ఫూర్తి గిరిజన సమాజానికి ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొని కొమురం భీమ్‌కు నివాళులర్పించారు.

# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

## సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో న్యాయమూర్తి బి. నికిత పిలుపు




**నర్సాపూర్ జి, అక్టోబర్ 26 (జనం సాక్షి):** బాలల హక్కులను పరిరక్షిస్తూ, వారిపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయమూర్తి బి. నికిత పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, నిర్మల్ ఆధ్వర్యంలో బాలల భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలలపై లైంగిక నేరాల నిరోధానికి పోక్సో చట్టం--2012 కీలకమని పేర్కొన్నారు. పిల్లలపై నేరాలు జరిగినట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, బాధితుల గోప్యతను కాపాడాలని సూచించారు. బాల్యవివాహాలు పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వాటి నివారణకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. బాధిత పిల్లలకు రక్షణ, కౌన్సెలింగ్, న్యాయ సహాయం అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాలల సమస్యలను గుర్తించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రతి బాలుడు, బాలిక భయం లేకుండా, వేధింపులకు దూరంగా గౌరవంగా జీవించే సమాజ నిర్మాణమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది షేర్ నరేందర్, నర్సాపూర్ ఎస్ఐ గణేష్, వివిధ శాఖల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# తాండూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- ఘనంగా నిర్వహించిన సర్పంచ్ ముడిమడుగుల సురేష్
- హాజరైన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ ప్రజలు



**తాండూర్, అక్టోబర్ 26(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా తాండూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. తాండూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందనడానికి ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీనే నిదర్శనమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పెద్దబోయిన శంకర్, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, మాజీ మండల ఎంపీపీ సిరంగి శంకర్, తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ షేక్ మోమిన్ అలీ, ప్రధాన కార్యదర్శి నవీన్ పటేల్, కార్యదర్శి ప్రభాకర్ అలాగే ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మహేందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పెద్దబోయిన రవి, వార్డు సభ్యులు పుల్గం శ్రీకాంత్, పురంశెట్టి అరుణ్ కుమార్, పెద్దబోయిన మహేష్, తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈసా, జిధుల వేణు, మైనార్టీ నాయకులు గౌస్ భాయ్, దుర్గం శ్రీను, ఇందురీ సత్యంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి జయంతి

### పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 26,(జనంసాక్షి )** జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఒక బోయవాడు గొప్ప కవిగా ఎలా మారాడో వాల్మీకి జీవితమే ఉదాహరణ అని చెప్పారు. ఆయన వల్లనే రామతత్వం అందరికీ బోధపడిందని, ఆయన రచించిన ఏడు కాండాల రామాయణం అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఆయన జీవితాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, బిసి అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, డిఈవో భోజన్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎల్డిఎం రామ్ గోపాల్, సహాయ బిసి అభివృద్ధి అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా వాల్మీకి సంఘ ప్రతినిధులు ఆకుల సుదర్శన్, వేల్పుల మల్లేష్, ఎండపల్లి అశోక్, ఆకుల రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## మున్నూరుకాపు కులాన్ని కించపరిచే వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు



**కుబీర్, అక్టోబర్ 26, (జనంసాక్షి):** మున్నూరుకాపు కులాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్నూరుకాపు కులస్థులు కుబీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్సి గ్రామానికి చెందిన శ్రీరాముల రాజేష్ ఇన్‌స్టాగ్రామ్‌లో తన యూజర్ ఐడీ ద్వారా మున్నూరుకాపు కులాన్ని ఉద్దేశించి అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో తమ కులస్థుల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు. దీనిపై ప్రశ్నించగా సరదాగా కామెంట్ చేశానని చెప్పినట్లు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో కులాలను కించపరిచే వ్యాఖ్యలు చేయకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత వ్యక్తిపై చట్టప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదుకు సంబంధిత కామెంట్ స్క్రీన్‌షాట్‌లను జత చేసినట్లు మున్నూరు కాపు కులస్తులు తెలిపారు.

# రైల్వే రీసర్వేలో నేరడిగొండకు అన్యాయం చేయొద్దు

**నేరడిగొండ అక్టోబర్26(జనంసాక్షి):** ఆదిలాబాద్--నిర్మల్--ఆర్మూర్ రైల్వే లైన్‌కు సంబంధించి చేపడుతున్న రీసర్వేలో నేరడిగొండ మండలాన్ని విస్మరించడం ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయంచేయడమేనని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వాగ్దరి సర్పంచ్ విజయ్, వెంకటపూర్ సర్పంచ్ వెంకట్ రాం, పాలియడ్ రమేష్,మాలి సంతోష్ లతో కలిసి రైల్వే రీసర్వేలో నెరడిగొండ కు అన్యాయం చేయొద్దని ఇందులో భాగంగా మెమోరాండం ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే అభివృద్ధిలో వెనుకబడిన నేరడిగొండ మండలానికి రైల్వే సౌకర్యం కల్పించాల్సింది పోయి,రీసర్వే పేరుతో రైల్వే మార్గాన్ని మరోవైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. నేరడిగొండ మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేయడంతో పాటు,ఇక్కడ రైల్వే జంక్షన్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపాదిత రైల్వే లైన్ రీసర్వేలో భాగంగా బరంపూర్ నుంచి బజార్‌హత్నూర్ మీదుగా సోనాల,కౌఠ,కన్నుగుట్ట, పొచ్చెర,కుచులాపూర్, ధన్నూర్ ప్రాంతాలను కలుపుతూ అడెల్లి సమీపం నుంచి సారంగపూర్ మీదుగా నిర్మల్‌కు రైల్వే మార్గాన్ని మార్చే ప్రతిపాదన ఉన్నట్లు ప్రచారం జరుగుతోందని సంతోష్ సింగ్ పేర్కొన్నారు.ఈ మార్గం ఖరారైతే నేరడిగొండ మండలం రైల్వే సౌకర్యానికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.నేరడిగొండ పరిసరాల్లోని కుప్టి ఘాట్లు, మహబూబ్ ఘాట్ల కారణంగా రైల్వే లైన్ నిర్మాణానికి అధిక వ్యయం అవుతుందనే కారణాలు చెబుతున్నారని ఆయన అన్నారు.కొండలు,ఘాట్లు ఉన్నాయనే కారణంతోనే ఒక ప్రాంతానికి అభివృద్ధి అవకాశాలను దూరం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.దేశంలోని అనేక ప్రాంతాల్లో కొండలను తవ్వి సొరంగాలు నిర్మించడం, లోయలపై భారీ వంతెనలు ఏర్పాటు చేయడం ద్వారా రైల్వే మార్గాలను అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుచేశారు.రైల్వే మార్గం ఎంపికలో నిర్మాణ వ్యయంతో పాటు ప్రయాణికుల అవసరాలు, భవిష్యత్ ప్రయాణికుల రద్దీ,సరుకు రవాణా అవకాశాలు,పర్యాటక అభివృద్ధి,సామాజిక ప్రయోజనాలు, పర్యావరణ ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.కేవలం




ప్రారంభ నిర్మాణ వ్యయాన్నే ప్రాతిపదికగా తీసుకోకుండా,దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. నేరడిగొండ మండలం ప్రకృతి అందాలకు, పర్యాటక ప్రాంతాలకు ప్రసిద్ధి చెందిందని వారు పేర్కొన్నారు.దక్షిణ భారతదేశంలో ఎత్తైన జలపాతాల్లో ఒకటిగా పేరుగాంచిన కుంటాల జలపాతం,పొచ్చెర జలపాతం,వాస్తాపూర్ జలపాతం,కోరటికల్ జలపాతం వంటి పర్యాటక ప్రాంతాలతో పాటు వైదుర్యపురంలోని ప్రాచీన కోటల ఆనవాళ్లు, మహబూబ్ ఘాట్ పరిసరాలు ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని,నేరడిగొండ మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే పర్యాటకులు సులభంగా ఈ ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉంటుందని, స్థానిక యువతకు ప్రజలకు ఉపాధి ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని,విద్యార్థులు,ఉద్యోగులు, వ్యాపారులు,వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు రైల్వే రవాణా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు కూడా అవకాశాలు పెరుగుతాయని,ఈ అంశంపై స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు, సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. రైల్వే రీసర్వే వివరాలను బహిరంగపరిచి, నేరడిగొండ మార్గాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. నేరడిగొండకు రైల్వే సౌకర్యం కల్పించే విషయంలో న్యాయం జరగకపోతే,త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు.పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరినీ కలుపుకొని ప్రజాస్వామ్యబద్ధంగా ఉమ్మడి పోరాటానికి శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు.

# గుడిహత్నూర్‌లో ఘనంగా కొమరం భీమ్ 86వ వర్ధంతి వేడుకలు

### మంకపూర్ నుంచి భారీ ర్యాలీ.. ఆదివాసీ మహిళల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ

### గిరిజన ఆచారాల ప్రకారం పూజలు.. అమరుడికి ఘన నివాళులు

**గుడిహత్నూర్, జనం సాక్షి:** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఆదివాసీ వీరుడు కొమరం భీమ్ 86వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మంకపూర్ గ్రామం నుంచి ఆదివాసీలు సంప్రదాయ డోలు వాయిద్యాలు మోగిస్తూ భారీ ర్యాలీగా మండల కేంద్రానికి తరలివచ్చారు. ర్యాలీ ఆద్యంతం ఆదివాసీ మహిళలు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి చూపరులను విశేషంగా అలరించాయి. అనంతరం కొమరం భీమ్ విగ్రహం వద్ద గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన కొమరం భీమ్ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకొని, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవా దౌలత్ రావు




మోకాశీ, ఆదివాసీ సేన నాయకుడు ఉయిక లక్ష్మణ్, ఆదివాసీ నాయకుడు జాలిమ్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, ఆదివాసీ మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరుడు కొమరం భీమ్ త్యాగాలను స్మరించుకుంటూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

# రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అచలాపూర్ విద్యార్థిని 'హర్షిత' ఎంపిక

**తాండూర్, అక్టోబర్ 26(జనం సాక్షి)** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తాండూర్ మండలం అచలాపూర్ పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 10వ తరగతి విద్యార్థిని చౌల్ల హర్షిత ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఏ. సాంబమూర్తి ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. మంచిర్యాలలోని ట్రినిటీ హైస్కూల్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మంచిర్యాల జిల్లా జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి, గోల్డ్ మెడల్ (బంగారు పతకం) సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టు తరఫున ఆడిన చౌల్ల హర్షిత క్రీడలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. హర్షిత చూపిన



ప్రతిభాపాటవాల ఆధారంగా వచ్చే నెలలో మహబూబ్ నగర్ జిల్లాలో జరగబోయే ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆమెను ఎంపిక చేశారు. గ్రామీణ ప్రాంతం నుండి క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన హర్షితను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమాదేవి, ఏఏపిసి చైర్మన్ చిలుకమ్మ, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్, వార్డు మెంబర్ పాపయ్య, సీనియర్ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, గ్రామ పెద్దలు మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. హర్షిత రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 26, జనం సాక్షి** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తీకి చెందిన మొహమ్మద్ గౌస్ పట్టణంలోని కూరగాయల మార్కెట్, బెల్లంపల్లి బస్తీ ప్రాంతాలలో రహదారి, మురుగు కాలువల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులో నా కాఫ్ ఒప్పందం రద్దు చేయాలని, సంక్షేమ గురుకులాలు, వసతి గృహాలలో సంక్షోభాన్ని పరిష్కరించాలని కోరారు. దండేపల్లి మండలం మోకాసిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్ జి టి బి.దేవకి తనకు ఇన్ సర్వీస్ బి.ఈడి. చేసేందుకు అనుమతించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ముదిగుంట గ్రామంలోని ఎస్.సి. కాలనీవాసులు తమ కాలనీకి సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న మట్టి ఇటుక బట్టి వలన కలుగుతున్న వాయు కాలుష్యం, ప్రజారోగ్యం, పర్యావరణ నష్టాలపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన చెట్టి శ్రీనివాస్ తనకు గురిజాల శివారులో గల భూమిలోకి కొందరు పి ఓ టి చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా ఆక్రమించుకొని పట్టా పొందారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన సల్లూరి దుర్గయ్య గ్రామ శివారులో గల బీడు భూములను వ్యవసాయ భూములుగా చూపించి రైతుబంధు తీసుకుంటున్న విషయంపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 66 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# జీఎం కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు




**శ్రీరాంపూర్ (జనంసాక్షి):**ఏరియా సింగరేణి జిఎం కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం నిజాయితీతో సమృద్ధి అనే నినాదంతో నిర్వహించారు. ఇంఛార్జ్ జీఎం ఏవీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా కార్యక్రమంలో అధికారులు,ఉద్యోగులు అవినీతికి వ్యతిరేకంగా సత్య నిష్ఠా ప్రతిజ్ఞ చేశారు. సింగరేణి వ్యాప్తంగా అక్టోబర్ 26 నుండి నవంబర్ 1వ తేదీ వరకు వారోత్సవాలు కొనసాగనున్నాయి. అవినీతి నిర్మూలనే ప్రధానంగా ప్రతీయేట సింగరేణిలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇంఛార్జ్ జీఎం తెలిపారు. వ్యక్తిగత ఆరోపణలకు తావివ్వకుండా వ్యవస్థలో లోపాలు గుర్తించి వాటిని సరిదిద్దుకోవటం,ఎవరి విధులు వారు నిబద్ధతతో నిజాయితీగా నిర్వహించటం ద్వారా సంస్థ అభ్యున్నతికి కృషిచేయాలని కోరారు. సంస్థలో ఎలాంటి అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం జరగకుండా చూడటమే విజిలెన్స్ ప్రధాన లక్ష్యమని,పారదర్శకతను పెంచేందుకు నివారణాత్మక, భాగస్వామ్య,శిక్షాపరమైన విజిలెన్స్ విధానాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్,గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, సీఎంఓఏఐ ప్రతినిధి పద్మ,ఏజీఎం శ్రీధర్,డీజీఎం రాజన్న,లా ఆఫీసర్ మల్లేష్,పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ , డీవై పీఎం లు రాజేష్,కిరణ్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్,పిట్ సెక్రటరీ సందీప్,ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

### నిర్మల్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పి.రవీందర్.




**కడెం: అక్టోబర్ 26(జనం సాక్షి)** విద్యార్థులు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నిర్మల్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పీ. రవీందర్ సూచించారు. నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రోజున నిర్వహించిన సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల రక్షణ, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బెట్టింగ్ యాప్స్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలతో పాటు దేశంలోని చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని జడ్జి సూచించారు. ముఖ్యంగా బాలల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం గురించి వివరించారు. బాలలు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులు, దాడుల విషయంలో చట్టపరమైన రక్షణ ఉంటుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ యాప్స్‌ను ఉపయోగిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని,బెట్టింగ్‌కు అలవాటు పడటం వల్ల ఆర్థికంగా, మానసికంగా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు.

**బాల్య వివాహాలపై అవగాహన...**

మైనర్ బాలికలకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల్య వివాహానికి సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చట్టాలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బెట్టింగ్ యాప్స్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు సీనియర్ సివిల్ జడ్జి పీ. రవీందర్ సమాధానాలు ఇచ్చారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా విద్యార్థులు తమను తాము రక్షించుకోవడంతో పాటు సమాజంలో ఇతరులకు కూడా అవగాహన కల్పించగలరని తెలిపారు.

# బిజెపి రాష్ట్ర ఐటీ కో కన్వీనర్‌గా కేశవ్ సోనీ



**బెల్లంపల్లి, అక్టోబర్ 26, (జనంసాక్షి)** బిజెపి తెలంగాణ రాష్ట్ర ఐటీ విభాగానికి కో కన్వీనర్ గా బెల్లంపల్లి పట్టణానికి చెందిన కేశవ్ సోనీ నియమితులయ్యారు. గతంలో ఏబీవీపీలో నగర సహాయ కార్యదర్శిగా, భాగ్ కన్వీనర్‌గా, జోనల్ ఇన్చార్జిగా, టెక్నికల్ సెల్ జిల్లా కన్వీనర్ గా, విభాగ్ కన్వీనర్ గా,రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, సమరత్ భారత్ దక్షిణ బెంగళూరు కోఆర్డినేటర్ గా, స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ గా, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కేంద్ర కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు ఈ బాధ్యతను అప్పగించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావుకి, రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్‌జికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నరేంద్ర మోడీ నాయకత్వంలో పనిచేస్తామని తెలిపారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కేశవ్ కి రాష్ట్రస్థాయిలో బిజెపిలో కీలకమైన బాధ్యతలు రావడం పట్ల బెల్లంపల్లి పట్టణ, నియోజకవర్గ ప్రజలు, మంచిర్యాల జిల్లా బిజెపి, ఏబీవీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం



**బెల్లంపల్లి, అక్టోబర్ 26, (జనంసాక్షి)** మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణంలోని కోదండ రామాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి దీపం వెలిగించి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమురాజుల శ్రీదేవి, బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు కొయ్యల ఏమాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి అంటే కేవలం ఒక మహర్షి పేరు మాత్రమే కాదని, ఆయన గొప్ప ఆలోచనకు, పరివర్తనకు, స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకిని భారతీయ సాహిత్యంలో ఆదికవిగా గౌరవిస్తామని, ఆయన రచించిన వాల్మీకి రామాయణం భారతీయ సంస్కృతి, ధర్మం, నైతిక విలువలకు గొప్ప మార్గదర్శకమని కొనియాడారు. రామాయణం కేవలం శ్రీరాముని జీవిత కథ మాత్రమే కాదని, జీవితంలో ఎలా నడుచుకోవాలి, కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, ధర్మం కోసం ఎలా నిలబడాలి, సమాజం పట్ల మన బాధ్యతలను ఎలా నిర్వర్తించాలి అనే విలువైన విషయాలను బోధించే మహాకావ్యమని ఆయన వివరించారు. మహర్షి వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, మనిషి గతం కంటే అతని పరివర్తన, ఆలోచనలు, ఆచరణ ఎంతో ముఖ్యమైనవని అన్నారు. ముఖ్యంగా యువత మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్య, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యతనిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొల్లెడ్ల కేశవరెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు నర్సింగ్ రాజు, జిల్లా కార్యదర్శి సీహెచ్ స్వామి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కాసిపాక గంగారం, జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, బిజెపి నాయకులు నస్పూరి లక్ష్మణ్, గంపల నరేష్, రామ్ హరీష్, డోలే చంద్ర కాంత్, దుర్గం భరత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ అందించండి రైతు కష్టాలపై స్పందించండి

### విద్యుత్ సమస్యతో ఎండిపోతున్న పంట పొలాలు మాజీ సర్పంచ్ కౌలు రైతు శ్రీపతి బాపు



**మహాదేవపూర్,అక్టోబర్ 26 (జనం సాక్షి):** సమయానికి విద్యుత్ అందుబాటులో ఉండకపోవడం విద్యుత్ ఉన్నప్పటికీ నాణ్యమైన విద్యుత్ అందకపోవడం, రైతుల కష్టాల పాలు కావడం జరుగుతుందని, విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులకు పంట పొలాలు ఎండిపోతున్నాయని సాగుకు అనేక ఇబ్బందులు తీసుకువస్తున్నాయని, మోటర్లు చెడిపోయి వేల రూపాయలు వెచ్చించి మోటర్లు పెట్టిన, సమయానికి రాకపోవడం, విద్యుత్ వచ్చిన లో వోల్టేజ్ ఉండడంతో, నీటి సరఫరా కాక పంట పొలాలు ఎండిపోవడం జరుగుతుందని, తను సొంతంగా కౌలు తీసుకొని ఎకరా 20 గుంటల వరి సాగు చేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా లేక మోటర్ చెడిపోవడంతో పాటు అర ఎకరం బీడు గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు మాజీ సర్పంచ్ కౌలు రైతు శ్రీపతి బాబు. సోమవారం రోజు కాలిపోయిన మోటార్ తో పాటు చెడిపోయిన పంట చూపెడుతూ ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం కాదా, 24 గంటల విద్యుత్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వ హామీలు ఏమైందని శ్రీపతి బాబు ప్రశ్నించారు, ప్రత్యేకంగా మహాదేవపూర్ మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా తరచుగా నిలిచిపోవడం లో వోల్టేజ్ సమస్యతో మోటర్లు చేడిపోవడం రైతులకు ఆర్థిక భారంగా మారిందని, వరి సాగు తో పాటు మిర్చి సాగు చేస్తున్న రైతులు కూడా విద్యుత్ సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఫీడర్ల నిర్వహణ సమస్య ట్రాన్స్ఫార్మర్లపై అధిక భారం కారణంగా సాగుకు ఆటంకం ఏర్పడుతుందని, విద్యుత్ కోసం పొలాలు మరియు చేన్లవద్ద రైతులు గంటల తరబడి వేచి చూడే పరిస్థితి వచ్చిందని కౌలు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ కౌలు రైతు శ్రీపతి బాబు డిమాండ్ చేశారు.

# సురక్షిత బచ్పన్ అభియాన్ కార్యక్రమం ప్రారంభం





**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 26 (జనం సాక్షి )** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ (హైదరాబాద్) ఆదేశాల మేరకు, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 26 నుండి అక్టోబర్ 31, 2026 వరకు నిర్వహించనున్న "సురక్షిత బచ్పన్ అభియాన్" (సురక్షిత బాల్యం ప్రచారం) కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రచారంలో భాగంగా మొదటి రోజు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, దేశాయిపేట, మరియు మామనూరు, మరియు ఏకశిల ఇ-టెక్నో స్కూళ్లలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో "నా బిడ్డ - నా హక్కు" (మై చైల్డ్ - మై రైట్ అనే ముఖ్యమైన అంశంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి.పూజ మాట్లాడుతూ, "బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా బాల్యానికి రక్షణ లభిస్తుందని, విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఎలాంటి వేధింపులు లేదా సమస్యలు ఎదురైనా ధైర్యంగా న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించవచ్చని భరోసా ఇచ్చారు. పిల్లలను శారీరక, మానసిక మరియు లైంగిక వేధింపుల నుండి రక్షించడం సమాజం మరియు చట్టం యొక్క బాధ్యత అని వివరించారు. పోక్సో చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారందరినీ పిల్లలుగానే పరిగణిస్తారని, ఆడ-మగ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఈ చట్టం వర్తిస్తుందని గౌరవ న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో భరోసా కేంద్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ సువర్ణ, షీ టీమ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్.రామారావు, హ్యూమన్ ట్రాఫికింగ్ (మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం) సి.ఐ ఓ.రమేష్ మరియు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, ఆన్‌లైన్ నేరాలు మరియు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పోలీసు మరియు న్యాయ వ్యవస్థలు నిరంతరం శ్రమిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఆపద సమయంలో డయల్ 100 లేదా షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వేధింపులకు గురైన పిల్లల లేదా సమాచారం అందించిన వారి పేర్లు, వివరాలను చట్టప్రకారం పూర్తిగా రహస్యంగా ఉంచుతామని, కాబట్టి ఎలాంటి భయం లేకుండా ఫిర్యాదు చేయవచ్చని న్యాయమూర్తి భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న బాలల కోసం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుందని, అలాగే భరోసా కేంద్రాలు, షీ టీమ్స్ మరియు చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) నిరంతరం అందుబాటులో ఉంటాయని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ప్రచార కార్యక్రమం అక్టోబర్ 31 వరకు జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో కొనసాగుతుందని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి.పూజ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పోస్టర్స్‌ను ఆవిష్కరించి, పాఠశాలల గోడలపై అంటించడం జరిగింది.

# ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

## మండల వ్యవసాయ అధికారి కె నరసింగరావు



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 26 ( జనం సాక్షి ) :** ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో విద్యుత్ కోతలు, సాగునీటి కొరత ఏర్పడే అవకా శం ఉన్నందున రైతులు యాసంగి సీజన్‌లో వరి, మక్కజొన్న పంటల సాగుకు దూరంగా ఉండి, ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలనిచిల్పూర్ మండల వ్యవసాయఅధికారి కె నరసింగరావు సూచించారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి రైతులకు పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా సోమ వారం చిల్పూర్ మండలంలోని రాజవరం గ్రామం లో ప్రత్యేక గ్రామసభనిర్వహించి రైతులకు అవగా హన కల్పించారు.ఈ సందర్భంగా మండల వ్యవ సాయ అధికారి మాట్లాడుతూ వరి, మక్కజొన్న పంటల కు అధికంగా విద్యుత్, సాగునీరు అవస రమవు తాయని, రానున్న రోజుల్లో నీటి వనరుల లభ్యత తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలై న శనగ, కుసుమ,పొద్దుతిరుగుడు తదితర పంట లసాగుకు ప్రాధాన్యతఇవ్వాలని కోరారు. భూగర్భ జల మట్టాలు తగ్గిపోవడం, పగటి ఉష్ణోగ్రతలు పెరగ డం వల్ల సాగునీటి లభ్యతపై ప్రభావం పడే అవకా శంఉందని తెలిపారు.రైతులు పరిస్థితుల కు అను గుణంగా పంటలఎంపిక చేసుకోకపోతే పెట్టుబడు లు పెరిగి ఆర్థికంగా నష్టపోయే ప్రమా దం ఉందని హెచ్చరించారు. అందువల్ల తక్కువ నీటి అవసర మయ్యే ఆరుతడి పంటలను సాగు చేసి, వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకోవాల నిసూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని రైతులకు సూచనలు అందించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ కిరణ్ ప్రసాద్, వెటర్నరీ శాఖ నుంచి అన్వేష్, యూనియ న్ బ్యాంక్ మేనేజర్,ఇరిగేషన్ ఏఈ వినోద్, హార్టిక ల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్,ఏపీవో మోహన్‌రావు, ఏఈఓ ఏ కిరణ్, పంచాయతీ కార్యదర్శి రాజు, మహిళా రైతులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



**పెద్దవంగర అక్టోబర్ 26 (జనం సాక్షి )**గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, సిఐటియు నాయకుడు కాసరబోయిన కుమార స్వామి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల ప్రధాన డిమాండ్లను యూనియన్ నాయకులు వెల్లడించారు. రెండో పీఆర్సీలో తమను చేర్చాలని, కనీస వేతనంగా నెలకు రూ.30 వేల రూపాయలు చెల్లించాలని కోరారు. ఆన్‌లైన్ విధానంలో లేని గ్రామ పంచాయతీ కార్మికుల పేర్లను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో కార్మికులంతా ఐక్యంగా పాల్గొనాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు . ఈ కార్యక్రమానికి శ్రీకాంత్,లక్ష్మణ్, ఎల్లమ్మ, సత్తయ్య,చారి,సిద్దు,సాయి, రజిత,మనీషా,యకమ్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల నివారణకు ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు



**ఏటూరునాగారం, అక్టోబరు 26జనంసాక్షి).** మండల పరిధిలోని శంకరాజుపల్లి, ముల్లెకట్ట గ్రామాల్లో ఎదురవుతున్న విద్యుత్ ఓవర్ లోడ్, లో-వోల్టేజ్ సమస్యలకు పరిష్కారంగా విద్యుత్ శాఖ అధికారులు అదనపు నూతన ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసి చార్జ్ చేశారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ పనులను శరవేగంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ బిక్షపతి, డీఈ పురుషోత్తం, ఏడీఈ ఉమారావు, ఏఈ పండ్ల శేఖర్, లైన్ ఇన్స్పెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

# ఐ కెపి సెంటర్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**పెద్దవంగర అక్టోబర్ 26(జనం సాక్షి )** రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని ఏపీఎం మండలంలో బిసి తండా మొహమ్మద్ పాషా అన్నారు. సోమవారం మండలంలో పోచంపల్లి మరియు గ్రామంలో బి సి తండ్రి గ్రామాలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచులు కుందూరు వెంకన్న, ధరవత్ రమేష్, తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీలు సుజాత ఉమారాణి సుధాకర్ ఆపరేటర్ అనిల్ ఆ గ్రామ సమైక్యల వివోఏలు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# గిర్నిబావి సెంటర్‌లో పోలీస్ అమరవీరులకు ఘన నివాళి



**దుగ్గొండి, అక్టోబర్ 26 (జనం సాక్షి):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దుగ్గొండి మండలం గిర్నిబావి సెంటర్‌లో పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సోమవారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో దేశ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొని అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలను గుర్తుచేసుకుంటూ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు ఈ కార్యక్రమంలో దుగ్గొండి ఎస్ఐ, గిర్ని బావి సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

## ఖానాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాహుల్ గైక్వాడ్




**ఖానాపూర్ రూరల్ 26 అక్టోబర్ (జనం సాక్షి):**పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఖానాపూర్ మండలం మస్కాపూర్ పీఎం శ్రీ జెడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 9, 10వ తరగతులకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు వ్యాసాలను బహుమతుల కోసం ఎంపిక చేయనున్నట్లు ఖానాపూర్ ఎస్సై రాహుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొమురం భీమ్ 86వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు








- ఆదివాసీ హక్కుల సాధనకు కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి మార్గదర్శకం
- వై జంక్షన్ వద్ద విగ్రహానికి పూలమాలలు వేసిన తుడుందెబ్బ నాయకులు

**ఏటూరునాగారం, అక్టోబర్ 26(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీ విప్లవ వీరుడు, హక్కుల పోరాట యోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చేసిన వీరోచిత పోరాటాన్ని, ఆదివాసీ సమాజ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలను నాయకులు స్మరించుకున్నారు. కొమురం భీమ్ తన జీవితాన్ని ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆదివాసీలు తమ భూములు, అడవులు, జల వనరులపై హక్కులను కాపాడుకోవాలనే లక్ష్యంతో ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. ఆయన ఇచ్చిన లి'జల్–జంగల్–జమీన్'లి నినాదం ఆదివాసీ సమాజ హక్కుల పోరాటానికి నేటికీ స్ఫూర్తినిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జాతీయ కార్యదర్శి పోదెం కృష్ణప్రసాద్, ఆల్ ఇండియా ఎంప్లాయిస్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ కోట రవి, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి కొమురం లక్ష్మికాంత, రాష్ట్ర కార్యదర్శి వట్టం జనార్దన్, నాయకపోడ్ పోడ్ దెబ్బ సీనియర్ నాయకులు బొల్లెం సారయ్య, ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకుల ధర్మయ్య, తుడుం దెబ్బ ఏటూరునాగారం మండల అధ్యక్షులు తాటి నీలాద్రి,మహిళ నాయకులు ఆలం సత్యనారాయణమ్మ, ఇతర ఆదివాసీ నాయకులు పాల్గొని కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**కౌటాల అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన వీరుడు కొమరం భీమ్ వర్ధంతి వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. సోమవారం కౌటాల మండల కేంద్రంలో ని కొమరం భీమ్ చౌరస్తా లో కాంగ్రెస్పి పార్టీ అధ్యర్యంలో విగ్రహానికి పూల మాల వేసి నివాళు లు అర్పించారు. కార్యక్రమం లో పార్టీ మండల అధ్యక్షుడు నీకోడే గంగారాం,మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం జానకి రావు, యాదవ సంగం మండల అధ్యక్షుడు గట్టన్న, మండల కమిటీ సభ్యులు ధోని రవి, దుర్గం వెంకటేష్, కథేరసాల శంకర్, జ్యోతిరావు, గోడిశెల రవి, నేతాజీ, రాంకుమార్, కిషోర్, దొంగ్రీ రవి, ధర్మయ్య, సుధాకర్, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**కాసిపేట అక్టోబర్ 26 (జనంసాక్షి) :** కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో, ఆదివాసి ముద్దుబిడ్డ కొమరం భీమ్ 86 వర్ధంతి ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొమరం భీమ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు నాయక్ పోడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, ముత్యం పల్లి మాజీ సర్పంచ్ ఆడే బాదు , నాయకులు పెంద్రం శంకర్, మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి పోరాట యోధుడు కొమరం భీమ్ అని జెల్ జంగల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ( ఏఎం )జిల్లా కార్యదర్శి సంకే రవి, బిజెపి మండల అధ్యక్షులు సూరం సంపత్ కుమార్, సామాజిక చైతన్య వేదిక ముఖ్య సలహాదారులు మద్దవేణి చిన్న భీమయ్య , బన్న రాములు, హేమచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిమిసంహారక మందు తాగి యువతి మృతి...



**దుగ్గొండి, అక్టోబర్ 26 (జనం సాక్షి):** దుగ్గొడి మండలం పీజీ తండాకు చెందిన నునావత్ సునీత మానసికంగా కలత చెంది క్రిమి సంహారక మందు తాగి హనుమకొండ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు దుగ్గొండి ఎస్ఐ మహేందర్ తెలిపారు. మండలంలోని పిజి తండకు చెందిన నునావత్ సునీత ఈనెల 25వ తేదీన కుటుంబంలో మానసికంగా వేధింపుల కారణంగా క్రిమిసహారక మందు తాగడంతో హనుమకొండ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు బంధువులు విజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామానికి చెందిన సునిత మరణానికి అదునపు కట్నం వేధింపులు కారణమని , అత్తింటివారు పెట్టిన వేధింపులే కారణమని, శ్రీనివాస్ , నూనావత్ కంసి, నూనావత్ లచ్చ వారిపై వరకట్న నిషేధ చట్టం కేసు నమోదు చేశారు. నిందితులు బాధితురాలిని అదనపు వరకట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధించడంతో, ఆమె పురుగుమందు (విషం) సేవించింది. చికిత్స పొందుతున్న క్రమంలో, బాధితురాలు నూనావత్ సునీత మృతి చెందింది. శవ పంచనామా జరిపి, తేజ్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

# గిరిజన దర్బార్ లో ప్రజల సమస్యలు తెలుసుకున్న ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



**ఏటూరునాగారం, అక్టోబర్ 26(జనంసాక్షి) :** ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్, పోలీస్, గిరిజన సంక్షేమం, విద్య, రహదారులు, డ్రైనేజీలు, ఉద్యోగాలు, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించి దరఖాస్తులు అందాయి. పంట పొలాలకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఒక దరఖాస్తు అందింది. భూ ఆక్రమణలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అంశంపై కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఫిర్యాదు కూడా అందింది. కొండాయిలో గోవిందరాజుల జాతరకు మండపం, ఎదురుకోలు తదితర ఏర్పాట్లకు సంబంధించి అనుమతులు లేదా ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. అంకంపల్లి పాఠశాలలో వంటశాల నిర్మాణం, బుర్రతండాలో సీసీ డ్రైనేజీ నిర్మాణం కోసం దరఖాస్తులు అందాయి. రాఘవపట్నం నుంచి రంగాపురం వరకు మట్టి రోడ్డు నిర్మాణం, రాఘవపట్నంలో సీసీ డ్రైనేజీల నిర్మాణం, ఇప్పలగడ్డ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణం, మల్లాయిపల్లిలో సీసీ డ్రైనేజీ నిర్మాణం కోసం కూడా దరఖాస్తులు సమర్పించారు. నందనాయక్ తండా, గీసుగొండ గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి సంబంధించి మరో దరఖాస్తు అందింది. ఆర్ సి ఓ కార్యాలయానికి సంబంధించి ఉద్యోగ నియామకం, డిప్యూటేషన్ తదితర అంశాలపై దరఖాస్తులు అందాయి. 2012 డి ఎస్ సి మెరిట్ జాబితా, డి ఎల్ ఎస్ సి 2012 వివరాలు, పెండింగ్ వేతనాల చెల్లింపు, నియామక అభ్యర్థనలకు సంబంధించి కూడా వినతులు సమర్పించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టా పాస్‌బుక్ ల కోసం మూడు దరఖాస్తులు అందగా, ఇందిరా జలప్రభ పథకం కింద మూడు బోర్‌వెల్స్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందాయి. గూడూరు మండలంలోని ఎకలవ్య పాఠశాల భూమికి సంబంధించిన సమస్యతో పాటు ఐటీడీఏ పరిధిలోని ఇతర అంశాలపై కూడా వినతులు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ప్రతాప్, ఏఓ అనిల్, డీడీ జనార్ధన్‌తో పాటు కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ములుగు జిల్లా కలెక్టర్‌ను కలిసిన టిజెఎ జిల్లా కమిటీ



**ములుగు ప్రతినిధి, అక్టోబర్26(జనం సాక్షి):** ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావ్ ను తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిజెఎ) ములుగు జిల్లా కమిటీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ కు పుష్పగుచ్చం అందజేయటం తోపాటు శాలువాలతో సన్మానించారు. తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిజెఎ)ములుగు జిల్లా కమిటీ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ ములుగు జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కొరకు సహకరించాలని వారు కలెక్టర్ ను కోరారు.దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు టిజెఎ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిజెఎ ములుగు జిల్లా అధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, గౌరవ అధ్యక్షులు ఎర్రం స్వామి,ఉపాధ్యక్షుడు చల్లగురుగుల రాజు, సంయుక్త కార్యదర్శి గట్టు ప్రశాంత్ గౌడ్, కమిటీ సభ్యుడు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## అంకన్న గూడెం నైట్ హాల్ట్ బస్ సర్వీసును పాత పద్ధతిలోనే నడిపించాలి

- రీజనల్ మేనేజర్ కి వినతి పత్రం
- సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన రీజనల్ మేనేజర్



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 2 6(జనం సాక్షి):** ములుగు మండలంలోని అంకన్న గూడెం నైట్ హాల్ట్ సర్వీస్ను గత సంవత్సరం నుండి వరంగల్ టు డిపో నుండి పరకాల డిపోకు మార్చడం వల్ల సర్వాపూర్ (అంకన్నగూడెం)ఉదయం 9 గంటలకు హన్మకొండకు డైరెక్ట్ పోయే బస్సును పర్కల డిపో అధికారులు హన్మకొండ కు పోకుండా పరకాల కు పోతుండడంతో (అంకన్నగూడెం, సర్వాపూర్, పెగడపల్లి. రాయిని గూడెం, కొత్తూరు, పంచోత్కులపల్లి, కాసిందేవిపేట, కన్నాయిగూడెం, జంగాలపల్లి మొత్తం 9 గ్రామ పంచాయతీ ల పరిధిలో ని గ్రామాల ప్రజలు హాస్పిటల్ మరియు వివిధ పనులకోసం పోయే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు గుండెబోయిన రవి గౌడ్ గుట్టమీది ముసలయ్య ఆలయ ప్రచార కార్యదర్శి గుండమీది వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నడుస్తున్న పరకాల డిపో నైట్ హాల్ట్ సర్వీస్ ను రద్దుచేసి వరంగల్ టు డిపో బస్సును పాత పద్ధతిలోనే నడిపించాలని 9 గ్రామ పంచాయతీల సర్పంచులు తీర్మానం చేసిన కాపీని సోమవారం రోజున రీజనల్ మేనేజర్ భాను ప్రసాద్ కి అందజేయడం జరిగింది. అలాగే ఆర్ఎం ని మొదటిసారి కలిసిన సందర్భంగా ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ అంకన్న గూడెం నైట్ హాల్ట్ బస్సు సమస్యను పాత విధానంలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా గుండెబోయిన రవి గౌడ్ గుండ మీది వెంకటేశ్వర్లు ఏజెన్సీ గ్రామాల సర్పంచులు ఆర్ఎంకి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు సన్మానం

**ఆత్మకూరు అక్టోబర్ 26 (జనంసాక్షి) :** వినాయక నవరాత్రి ఉత్సవాలు, దేవీ నవరాత్రి ఉత్సవాలు, సద్దుల బతుకమ్మ, విజయదశమి సందర్భంగా ఆత్మకూరు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో నిరంతరాయంగా, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసినందుకుగాను ఆత్మకూరు మండలం జనరల్ బాడీ మీటింగ్ లో మండల తహసిల్దార్, ఎంపీడీవో అన్ని గ్రామాల సర్పంచులు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ సుదర్శన్ ను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.